రాఘవయ్యగారంటే నాకెంతో గౌరవం.

ఆ గౌరవం యెందుకంటే నేను చెప్పలేను. కొందర్ని చూస్తే కారణం ఏమీ లేకుండానే అసహ్యమేస్తుంది. యిదీ అంతే. ముఖ్యంగా చిన్నప్పుడు యేర్పడ్డ అభిప్రాయాలకి కారణాలు దొరకవు. అందుకే అవి ఎన్నటికీ చెదిరిపోవు గూడా.

ఆయన యీ సర్వీస్‌లో జేరకముందు రెండు మూడేళ్ళు మా హైస్కూల్లో టీచరుగా పనిచేశాడు. ఆ రోజుల్లో నేను ఆయనదగ్గిర చదువుకోడం తటస్థించింది. బాగా చెప్తాడని ప్రతీతి. ఆయన పేరు ప్రఖ్యాతుల మా టెలా వున్నా, ఆయన నేనంటే యెంతో అభిమానం కనబర్చేవాడు అప్పట్లో మార్కులు బాగా వచ్చేవి గాబట్టి నేనొక "మంచి బాలుడు" గ నమూనా. అందుకు కావచ్చు. నేనంటే చాలా ఆప్యాయతా. ఆదరం చూపించేవాడు క్లాసులో అందర్నీ అడిగి ఎవరూ చెప్పలేని రూఢి చేసుకున్నాక గాని నన్ను ప్రశ్న వేసేవాడుగాదు; వేసేప్పుడుగూడా, "చూడండి, ఇప్పుడు మనరావు చెప్తాడు!" అనేవాడు. నా కేమిటో యేను గెక్కినంత పనయ్యేది.

ఆయనంటే అపారమైన గౌరవం కలగడానికి కారణం ఆయన నన్నలా పొగడ్డమేనేమో!

ఆయన ఆ ఉద్యోగం చెయ్యడానికి కారణం పేదరికమని, పైకి చదివితే ఏదో పెద్ద ఉద్యోగం వెలిగించగలడని జాలి, దయ, సానుభూతిలాంటి భావాలు కూడా మా కాయనంటే వున్న గౌరవంలో కలిసిపోయేవి. చివరికి మా భావాలకి అతికినట్టుగానే, ఆయన పెళ్ళిచేసుకొని కట్నంతో పైకి చదివి పెద్ద ఉద్యోగి, అయాడు.

ఇదంతా ఏదో గారడిసాయబు కర్ర ఆడిస్తే గోనెపట్టాలో మామిడిమొక్క మొలిచినట్టు జరిగిందికాదు! సుమారు యిరవై యేళ్ళవుతుందేమో, ఆయన్నం తకుముందు చూసి ఇప్పు డాయనకి ఎనిమిదివందల జీతం. ఎవరికన్నా ఉప కారంగాని అపకారంగాని చెయ్యడానికి సమర్థుడు. ఉపకారం చేసేవాళ్ళకన్నా అపకారంచేసే వాళ్ళంటే ఎక్కువ గౌరవ మిస్తారు చాలా మంది రాఘవయ్యగా రంటే ఊర్లో ఎంతో పేరు! కావల్సినంత అధికారం, దా న్ననుసరించిన మిగతా వన్నీ! పెద్ద బంగళా, అయిదుగురు నవనవలాడే పిల్లలు—ఇప్పటి యీ పరి స్థితుల్లో వెనక ఎప్పుడో బడిపంతులు చేశానని తల్చుకోడమే సిగ్గుచేటుగా కన బడుందేమో!

ఆనాటి ఆ బడిపంతులు ఉద్యోగానికి ప్రత్యక్షసాక్షిని నేను! నన్ను చూసి ఆనాటి తన స్థితిమీద వున్న యేవగింపు అంతా ప్రదర్శిస్తాడేమో! పైగా, సాయం కాలం ఆరుగంటలు కావస్తోంది ఇలాంటి వేళ పెద్ద ఆఫీసర్లూ, రోజంతా శ్రమదానం దేసినవాళ్ళూ, చికాగ్గా ఉంటారు. యింటి దగ్గిర ఆఫీసుమనుషుల్ని కలుసుకోడం కొంతమందికికిట్టదు, ఇలాంటిఅనుమానా లన్నీ పీడిస్తుంటే గేటు దగ్గిర నిల బడ్డాను. గేటుకి చాలా దూరంగావున్న మేడలో యెక్కడా మనిషి సంచారం ఉన్నట్టులేదు నిర్జీవంగా వుంది

పెద్దవాళ్ళ యిళ్ళు అలానే ఉంటాయి. పిరికిగా మెల్లిగా అడుగులువేసి మెట్ల దగ్గిర జేరాను ఎవరో అమ్మాయి లోపల హాల్లో అటునుంచి యిటు వెళ్తూ ఒకసారి నావంక చూసి నాతో మాట్లాడ్డం తన పని గాదన్నట్టు నిర్లిప్తంగా ప్రక్కగదిలోకి వెళ్ళిపోయింది అదే పగటివేళ అయితే మరికాస్త గౌరవంగా చూసేదేమో; మసగ్గా ముసిరిన చీకట్లలో సరిగ్గా కన బడి ఉండకపోవచ్చునని ఓదార్చు కున్నాను. కాసేపటికి నౌక రెవడో బయటి కొచ్చి ఎదురుగ్గా నిలబడ్డాడు— మాట్లాడ్డం నావంతు అన్నట్టు.

"అయ్యగారున్నారా?"

'ఉన్నారుగాని ఇప్పు డెవర్తోనూ మాట్లాడరు."

"నాది చాలా పెద్దపని, అర్జంటుగా కలుసుకోవాలి"

"పేరు రాసియ్యండి, చూబెట్తాను. పిలిస్తే పిలుస్తారు. మీ అదృష్టం"

విజిటింగ్‌కార్డు తీసి యిచ్చాను.

నాకంత బాగా తెలిసిన రాఘవయ్యగారి ఇంటిముందు నే నలా నిలబడి ఉండడం చాలా తమాషాగా ఉంది! కానేపు పట్టింది నౌకరు వచ్చి రమ్మనేసరికి. రమ్మన్నారని వినగానే నా కేమిటో చెప్పలేని ఉత్సాహం, ఆనందం కలిగాయి. నాకు తెలుసు, మా సంబంధం, కాలం రేపిన ఇసకగాడ్పులకి మాసిపోయేది గాదని!

హాల్లో గోడలకి, సీలింగ్‌కి బ్లూ డిస్ టెంపర్ కొట్టివుంది. డిఫ్యూజ్డ్ లైటింగ్. సోఫాలు, టీపాయ్‌లు ఎక్కడుండాల్సినవి అక్కడ అందమైన గుడ్డల్తో అలంకరించి ఉన్నాయి. ఒక మూల స్టూల్‌మీద గ్లాస్ కేస్‌లో చిన్న బల్బు కాంతిలో మెరిసిపోతూ తాజ్‌మహల్ పాలరాతి నమూనా. ఎదురుగ్గా గోడమీద అద్భుతంగా నవ్వుతున్న నెహ్రూ ఫొటో. ఆయన హోదాకి, టేస్ట్‌కి ప్రతిబింబం ఆ హాలు.

దాన్ని మెచ్చుకుంటూ మెట్లన్నీ ఎక్కాను. పైన మరో హాల్లోంచి బాల్కనీ మీదికి తీసికెళ్ళి లైటువేశాడు నౌకరు. బాల్కనీ వీధికేసివుంది చాలా విశాలం. చుట్టూ రకరకాల క్రోటను కుండీలు వున్నాయి. క్రిందినుంచి పాకిన

బోగన్‌విల్లీ గుత్తులు రెండువైపుల్నించీ ఎర్రగా తొంగిచూస్తున్నాయి.

మసకవెన్నెల, హాల్లో లైటు పరిచిన కాంతితో రాఘవయ్యగారు తెల్లటి లాల్చీ, పంచెలో మెరిసిపోతున్నట్టున్నారు.

''రండి, కూర్చోండి ''

"మీరలా మన్నిస్తూంటే తిట్టుతున్నట్టుంది నాకు! మామూలుగా, 'నువ్వు' అనండి.''

ఆయన నవ్వాడు చాలా దయగా

"ఎన్నాళ్ళయింది నువ్వీ కంపెనీలో జేరి?"

"అప్పుడే మూడేళ్ళయిందండి. ఇంత వరకు వైజాగ్‌లో ఉండేవాడ్ని ఇప్పుడు అక్కడ బ్రాంచి ఎత్తేశాక నేనూ ఇక్కడికే వచ్చేశాను."

"ఊహూం!''

ఆ తర్వాత మాటలు చాలా మామూలు విషయాలమీదికి మళ్ళాయి. వాటికంత ప్రాముఖ్యంలేదు. కాలం గడిచిపోతుంటే నాకు అంతకంతకి ఒక మాదిరి అశాంతి లాంటిది ఎక్కువ కాసాగింది. ఆయనకీ నామాటలంతగా రుచించినట్టు కనబడ లేదు.

"మీ రీ ఊర్లో ఉన్నారని తెలిసినప్పట్నించీ మిమ్మల్ని కలుసుకోవాలని చాలా ఇదయ్యాను. ఇప్పటికి వీలు పడింది!"

ఆయ నేం మాట్లాడలేదు.

"యీ రోజుల సుఖం, సంతోషం మధ్య, వెనక్కి ఆ రోజులవైపు చూస్తే మీకు అంతా పీడకలలాగుంటుందేమో!"

"చూడు రావ్! సుఖం, సంతోషం అనేవి ఎండమావుల్లాంటివి. వాటిని మనం వెంబడించిన కొద్దీ దూరంగా పోతూంటాయి. నేను సుఖంగా ఉన్నానని నువ్వు, నువ్వు సుఖంగా వున్నావని నేను ఒకర్నొకరు మోసపుచ్చుకోడం తప్పించి నిజానికి సుఖమనేది యిద్దరికీలేదు! అసలు సుఖమనేదే లేదేమో!''

"పెద్ద ఉద్యోగం, చక్కటి యిల్లూ, కావల్సినంత డబ్బూ - ఇంకేంలోటు చెప్పండి మీకు?'' నేను నవ్వాను.

ఆయనకూడా అదోలా నవ్వాడు. దాని అర్థాలు చాలా కనబడ్డాయి. నువ్వేం ఎరుగుదువన్నట్టు, నీ ఎత్తు నాకు తెలుసు గాని నువ్వు తొడగాలనుకుంటున్న కుచ్చు టోపీ నేను తొడిగించుకో నన్నట్టు, హేళనగా, నిరసనగా నవ్వుతున్నట్టనిపించింది. కాసేపటి కాయన మొదలెట్టారు.

"రావ్! ఉద్యోగానికి పెద్ద, చిన్న అనేవి మన మనసులో ఉంటాయి. బడి పంతులుకి హెడ్మాస్టరు పదవే పెద్దదిగా తోచచ్చు మంత్రి అయినవాడికి ప్రధాన మంత్రి అయితేనేగాని తృప్తి ఉండక పోవచ్చు...''

"అంతేలెండి అన్నీ మన మనసు లోనే ఉంటాయి.''

"నీ మాటలు వింటుంటే, నే నేదో స్వర్గసౌఖ్యాలు అనుభవిస్తున్నా నను

కొంటున్నట్టుంది విజానికి నా పరిస్థితి అందుకు చాలా భిన్నం నా బాధలన్నీ నీ ముందు ఏకరువుపెటాలని గాదనుకో. అయినా మాటవరసకి చెప్తాను విను... పెద్దమ్మాయి పెళ్ళీడుకొచ్చి అయిదేళ్ళయింది ఎపిడో కాస్త చదువూ, ఆస్తీ వగైరా ఉన్నాయనుకొన్నవాడ్ని బేర మాడితే పాతికవేలకి తగ్గమన్నారు మళ్ళీ యేటికి వాయిదా వేసి మాట్లాడ కూరు కున్నాను. రెండో అమ్మాయి ఎం బి. రెండో యేడాది మూడేళ్ళనుంచీ చదువు తోంది. ఓ వారంరోజుల్లో అది పళ్ళీ కాలేజికి పోతుంది దానికి డబ్బిచ్చి పంపాలి. యిదిలా ఉండగా పెద్దాడు బి. ఎస్‌సి. వాడి కెక్కడా యింజనీ రింగ్‌లో సీటు రాలేదు ఆరు వేలిచ్చి అక్కడెక్కడో సీటుదొరుకుంతుందంటే మొన్నే రిజర్వు చేయించివచ్చాను. ఎవరి దగ్గిరో అప్పుతీసుకొని. అదొకటి తీర్చాలి. యివన్నీ ఎక్కడ్నించి తేను? నా హోదా, జీతం చూసి సంబరపడాలి తప్పించి నాకున్న బాధ్యతలు సమస్యలు! వాటిగురించి ఆలోచిస్తుంటే ఎంత బాధగా ఉంటుందో తెలుసా?"

"కాని మీరు చేస్తున్నదల్లా ఒక యెత్తైన అంతస్థుకి మెట్లు కట్టడం! అందు మూలంగా ఎదురయ్యే యేవో తాత్కా లిక సమస్యల్ని యేకరువుబెట్టి యివి మామూలుగా అందరికీ యెదురయే తిండీ, బట్టాలాంటి సహజమైన తీవ్రమైన సమ

స్యల్తోసమానంగా చూబెట్టాలని ప్రయత్ని స్తున్నారు?"

నే నన్నమాటలు ఆయనకి కోపం తెప్పించాయని తెలుస్తూనే ఉంది.

"ఏమిటి ను వ్వనేది ? నాకూతుర్ని పెద్ద ఉద్యోగస్థుణ్ణి కిచ్చి పెళ్ళి చెయ్యాలనుకోడం అసహజమయిన కోరికా! నా కొడుక్కు పెద్దచదువు చెప్పించాలనుకోడం దురాశా !..... నేను యీ లోకంలో ప్రవేశపెట్టినవాళ్ళకి, నన్ను నమ్ముకుని బ్రతుకుతున్నవాళ్ళకి ఆధారం చూపించడం నా రిసీసబాధ్యత. రావ్ '...నే నెంత పేదవాడినో నువ్వు యెరుగుదువు. మంచి మార్కులు వచ్చినా పైచదువులు మానేసి పొట్ట పోసుకోడానికి ప్రయత్నించాను. చివరికి ఎలాగైతేనేం అవకాశంవచ్చింది ఈనాడు ఆర్జించే పరిస్థితిలోఉన్నాను ఆర్జించడం నావిధి, అవకాశాలు లేనినాడు నేను చెయ్యగలిగిం దెలాగూలేదు. ఉన్నప్పుడు జారవిడుచుకోడం పిచ్చి అనిపించుకుంటుంది...జాగ్రత్తగా అర్థంచేసుకో. నా తోటిఉద్యోగి. నాకన్నా చిన్నవాడు, ఎయిర్‌కూలర్, ఫ్రిజ్, ఫియట్‌కారు పెట్టుకు కులుకుతున్నాడు నాకుమాత్రం స్వంతకార్లో తిరగాలని ఉండదూ! పోనీ మనసంగతి వదిలేయ్ మనం వేదాంతులం. ఆడవాళ్ళసంగతి ' ఒకామె యింటోకి వెళ్ళగానే, ఫ్రిజ్‌లోంచి తాజాగా, చల్లగా ఏ సఫ్లెనో అందరికీ తీసి పంచిపెట్టుంది, ఆమె కళ్ళలో ఆధిక్యతా, గర్వం చూసి నాభార్యకి కోరిక పుడుతుంది. అది లేకపోవడంకన్నా దారిద్ర్యం యింకోటి లేదనుకొంటుంది ఇంట్లో పోరు మొదలు. యివన్నీ అసహజమైనవికావు చాలా నిజమైనవి. సహజమైనవి ఇంతెందుకు! డబ్బు అనేదానికి పరిమితులు, ఎక్కువ తక్కువలు నిర్ణయించడం అవివేకం చేతయినంతవరకు సంపాదించడమే చేయగలిగింది! పైనుంచి క్రిందదాకా అందరూ చేసేదీ అదే ఐనప్పుడు. మనం మడిగట్టుకోడంలో అర్థంలేదు. లేకపోతే అసలు యీ చదువు లెందుకు, ఉద్యోగా లెందుకు? తృప్తిగా ఎక్కడో ఏ పూరిగుడిసెలోనో గడిపేయడం మంచిది ' ... యింతకీ యేమ్ టో మాట్లాడేశాను పట్టించుకోక చెప్పొచ్చింకల్లా ఏమిటంటే సుఖం, సంతోషంలాంటివన్నీ సాపేక్షమైనవి. ఎవళ్ళ బాధలు వాళ్ళకుంటాయి!"

పరిస్థితి స్పష్టంగా తేలిపోయింది ఇంక ఆలస్యంచెయ్యడం అనవసరం

"మా కంపెనీ గురించి మాట్లాడ్డానికి వచ్చాను మీరు సర్టిఫికెట్ యివ్వడానికి రెఫ్యూజ్ చేశారని చెప్పాడు గుమాస్తా."

"అవును. ఏవో అబ్జక్షన్సు ఉన్నాయిట "

నేను మాట్లాడలేదు జేబులోంచి కాగితాల కట్ట బయటికి తీశాను. వాటి మీద ఆయన సంతకం చేస్తే కంపెనీకి కొన్నివేలు మిగుల్తాయి

"ఆబ్జక్షన్సు ఫెద్దగా ఏం లేవండి. మీరు సంతకం చేస్తే అన్నీ సర్దుకుని పోతాయి. ఆఫీసు స్టాంప్‌కూడా వేయించే తీసుకువచ్చాను. సైన్ చేసేస్తే చాలు... మళ్ళీ నేను రేపో, యెల్లుండో వెళ్ళి పోవాలి."

ఆయన కుర్చీముందు టీపాయ్‌మీద కాగితాలు ఉంచాను. పై కాగితం గాలికి రెపరెపలాడుతూ లేచింది.

"ఏమిటోయ్! ఏమి టిది?"

"ఫర్వాలేదు. ఉంచండి. యిప్పుడే అన్నారు మీరు. అవన్నీ నేను ముందు గానే ఆలోచించి తీసుకొచ్చాను అయినా మాకు జరిగే లాభంముందు యిదెంత?" ఆయన మాటలు అంత స్పష్టంగా తేల్చి నందుకు కొద్దిగా సిగ్గుపడ్డా దనుకుంటాను; బహుశా నేను పాత పరిచయాన్ని పుర స్కరించుకుని పని చేయించుకోవా లను కున్నానని ఊహించాడేమో! అది నిజం కాదని తెలిశాక కొద్దిగా తబ్బిబ్బౌతున్న ట్టుంది!

"అయితే మాత్రం నీ దగ్గిర పుచ్చు కుంటానా? యిందాక చెప్పిందంతా ఊరికే, ... గతావాళ్ళగురించి...అసలు నీ కీ కంపెనీతో సంబంధం ఉందని తెలిస్తే, ఆఫీసులోనే సంతకం పెట్టేసి ఉండేవాణ్ని."

నేను నవ్వి ఊరుకున్నాను. ఆయన మాటలకి విలువలేదని ఆయనకీ తెలుసు, నాకూ తెలుసు. ఆయన సంతకం పెట్టి యిచ్చేశాడు నోట్లకట్ట టీపాయ్‌మీదికి జారింది. పని తొందరగా ముగిసింది. టైం ఇంకా ఆరూ నలభయ్యే. నేను బాల్కనీలోంచి గేటవతల రోడ్డుమీదికి

చూపేంతలో టీపాయ్‌మీది నోట్లకట్టని కాసేపు చేతుల్లో ఆడించి నేర్పుగా జేబులోకి జార్చారు రాఘవయ్య. నా కొక్కసారిగా చెప్పలేని దిగులూ, జాలీ, బాధా మనసులో రేగాయి

"చూడు రావ్! నేను నీ కేమన్నా కష్టం కలిగించానేమో? తీసుకువెళ్ళిపో."

"ఛా! అదేం లేదండీ. మాకిది అలవాటే. అయితే మీకు కొత్తేమోనని భయపడ్డాను."

"క్రొత్త ఏమిటోయ్! యీ ఉద్యోగంలో యించుమించు అందరూ ఒకటే. పుచ్చుకోనివాడు పాపాత్ముడు ... నా సంగతంటావా? నా వ్వన్నట్టు నా ఆశలూ కోరికలూకొంచెం మోతాదు మించినవిలా కనబడతాయి కాని నేను చేయగలిగిందేమీ లేదు. పరిస్థితులకి దాసులం మనమంతా. ఆర్కటిక్ ప్రాంతంలో తోడేళ్ళు ఎండాకాలం రాగానే గుహల్లోంచి బయటపడి తిండికోసం వెతుకుతాయిట అప్పుడే కొత్తగా మొలిచిన కత్తుల్లాంటి నదుపు ఆకుల్ని చూడగానే నోరూరుతుంది. నాకడం మొదలెడ్తాయి. నాలిక చిట్లి రక్తం చిందుతుంది ఆ రక్తాన్ని తాగి రుచిగా ఉందని యింకా యింకా నాకుతాయట. ఇలా చివరికి తమ రక్తాన్ని తామే పీల్చి చనిపోతాయని రాజగోపాలచారి పిట్టకథ మనమూ అంతే యించు మించు. ఇలా మనల్నీ, యెదటివాళ్ళనీ పీడించుకుంటూ, మోసగించుకుంటూ ఆనందిస్తాం. నశిస్తున్నామన్న జ్ఞానం లేకుండా చివరి కేదో జరుగుతుంది.

"ఇంక అప్పటికి మిగిలే దేం ఉండదు; ఏడవడం తప్పించి. ఏమంటావు?"

"ఏమనను? మనక్కావల్సింది మనకి దొరికాక ఆ తృప్తిలో ఎంతో మంచిగా, జ్ఞానాన్నంతనీ ఏకరువు బెట్టటం అందరూ చేసేదే."

"అసలు యీ బ్రతుకే ఒక పెద్ద ముళ్ళకంచె. అన్నీ ముళ్ళే. ఎటు ఒత్తిగిలినా గాయాలు తప్పవు నీ దగ్గిర ఇది తీసుకోకపోతే నా ఇబ్బందులకి నా వాళ్ళనీ, వాళ్ళ అవసరాల్నీ బలిచేసినవాణవుతాను తీసికుంటే నీ కన్యాయం చేసినవాణ్ణవుతాను. ఇంక మొండిగా విధి, కర్మ అనుకొని తృప్తిపడి, మన బాధ్యతలు మనం నెరవేర్చడం తప్పించి గత్యంతరంలేదు ఒకోసారి యీ బాధ్యతలు పరస్పర విరుద్ధాలయి అన్నివైపులా బాధని పోగుచేస్తాయి మానవమాత్రులం మనం చూసి వినోదించడం తప్పించి చేయగల్గిందేముంది!..." ఆయన ప్రవాహంలో ప్రశాంతంగా వేదాంతాన్ని బోధిస్తుంటే నాలో విచారం అంతకంతకీ ఎక్కువ కాసాగింది ఆయనంటే అపారమైన గౌరవమని యింతకుముందే చెప్పాను.

సరిగ్గా ఏడయింది.

కాంపౌండు గోడమీంచి, రోడ్డుమీద జీపు ఆగిన కొద్దిక్షణాలకి సి ఐ.డి. ఇన్‌స్పెక్టర్ సుదర్శనం తల కన్పించింది. ఏడుగంటలకి కావాల్సిన సరంజామా అంతటితో అక్కడికి రమ్మని సుదర్శనానికి ఆర్డర్లున్నాయి. నేను లేచి నిలబడి సిగరెట్ వెలిగించాను. మా పథకం ఫలించినట్టు గుర్తు.

ఇంక కథ పొడిగించడం అనవసరం.

"రావ్!" అన్నా డాయన జీపులో కెక్కుతూ. ఆకళ్ళు గొంతూ చూసి నాలో రేగిన భావా లెలాంటివో ఊహించుకోగలిగినవాళ్ళు ఊహించుకోవాలి; గాని, మాటల్లోకి తర్జుమా చెయ్యగల సమర్థుణ్ణిగాను నేను.

"నా బాధ్యత నేను నెరవేర్చాను మేష్టారూ? అయితే మన యిద్దరి బాధ్యతలకీ అతుకు కుదరకపోవడం యీ ముళ్ళకంచె లోపం!"

గుమ్మంలో నిలబడ్డ ఆయన కుటుంబాన్ని చూడ్డానికి నాకు శక్తి చాలలేదు. కాని వాళ్ళ పరిస్థితిని ఊహించి నా చెంపని జారిన ఒకటి రెండు నీటి బిందువుల్ని తుడిచిపారేయడం తప్పించి నేను చేసిందీ, చేయగల్గిందీకూడా ఏంలేదు.